# కొత్త ఒరవడి

- వై.కె.మూర్తి.

"అమ్మా!"

పెద్ద కోడలితో కలసి డైనింగ్ టేబుల్ మీది వస్తువులు కిచెన్‌లోకి సర్దుతున్న కమలమ్మ ఆగింది.

"మేము వచ్చే నెల మొదటి వారంలో సత్యనారాయణపురం వెళ్లిపోతున్నామమ్మా" అన్నాడు పెద్దకొడుకు ప్రసాద్.

"సత్యనారాయణపురమా?"

"అవునమ్మా! ఇక్కడి నుండి ఆఫీసుకు వెళ్లి రావడానికి సుమతి బాగా కష్టపడుతోంది. అయినా తను పాపం నోరు తెరిచి ఆ మాట ఎప్పుడూ చెప్పలేదనుకో! నేను ఈమధ్య తనకి ఆపరేషన్ కూడా జరిగిందని ఇల్లు చూశాను."

కమలమ్మ కోడలు సుమతి పని వున్నట్లుగా ప్రక్క గదిలోకి వెళ్లిపోవడం చూసి నవ్వుకుంది.

సుమతి ఎంత అదృష్టవంతురాలు. ఆమె ఎక్కడ కందిపోతుందో అని ప్రసాద్ ఎంతో అపురూపంగా చూసుకుంటాడు.

నిన్నగాక మొన్న పెళ్లయిన శరత్ మాత్రం ప్రసాద్ తరహాలో ఉండడు. అందుకే కోమల తనే భర్త తరఫు నుండి కూడా మాట్లాడుతుంది. అందుకే రాత్రి తనతో చెప్పేసింది.

'అత్తయ్యా! మేము కొత్త ఇంటికి మారిపోతున్నామండీ! మా పెళ్లికి వచ్చిన ప్రెజెంటేషన్స్, మా వాళ్లిచ్చిన సారె సామాన్లూ వృథా అయిపోయి అటక మీదికి చేరిపోకుండా సద్వినియోగం అవుతాయి. ఇక్కడెలాగూ బావగారు వాళ్లు మీకు తోడుగా ఉన్నారు కూడానూ!' అంది చిన్న కోడలు కోమల.

ఇద్దరు కొడుకుల వేరు కాపురాలను గురించి భర్తకి చెప్పింది.

'అయ్యో! అదేంటి కమలా! నాలాగే నా పిల్లలకీ పెద్దవాళ్లతో కలిసి ఉండడం ఇష్టం లేదా ఏమిటీ?' అన్నాడు భర్త వెంకట్రావు.

'ఎక్కడో ఓచోట వాళ్లు సుఖంగా ఉండడమేగా మనకి కావలసింది' అంది కమలమ్మ.

మొదటి వారం వచ్చింది.

కొడుకులిద్దరూ ఒకే రోజున వేరువేరుగా వెళ్లిపోయారు. చుట్టాలు, స్నేహితులూ కమలమ్మ ఎంతో దురదృష్టవంతురాలని జాలిపడ్డారు.

అత్తమామల అధికారం, మరుదులూ, ఆడబిడ్డల పెత్తనం ఆమెని ఎన్నో ఏళ్లపాటు వేధింపుకి గురిచేశాయి. అది చూసి అప్పట్లోనే అందరూ ఆమె దురదృష్టానికి జాలిపడ్డారు.

నిజంగా తను ఎంతో దురదృష్టవంతురాలని ఆ రోజుల్లో కమలమ్మ కుమిలిపోయేది.

కానీ ఇప్పుడు ఆమెకి ఎంతో ఆనందంగా వుంది. కోడళ్లు ఉద్యోగాలకెళ్తే ఇల్లు కావలాకాస్తూ మనవళ్లని, మనవరాళ్లను చూసుకోనక్కర్లేదు. వాళ్లకిష్టమైనవి వండుతూ వంటింట్లో మగ్గిపోనవసరం లేదు. తను అనే వ్యక్తి ఉన్నట్లే మర్చిపోయి సమిష్టి కుటుంబం కోసం సదా శ్రమపడి పోనవసరం లేదు.

ఏభై ఏళ్లకైనా తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందగలిగింది. తన బ్రతుక్కింక ఓ అర్థం కల్పించుకోగలుగుతోంది. ఇదో కొత్త ఒరవడి కావాలి. తనలాంటి ఆడవాళ్లంతా పిల్లలు దూరమయ్యారే అని దీనంగా మారిపోకూడదు. దివ్యంగా శేష జీవితాన్ని గడపగలగాలి. ఇన్నేళ్లుగా అణగారిన ఆశలూ, ఆశయాలకు రూపాన్నివ్వాలి- అనుకుంది ఎంతో సంతోషంగా కమలమ్మ. ❑